# జప్తు

గ్రామ సావిడి చీడపట్టిన పైరులా వికారంగా వుంది. మురికి కాలువలా వుధృతంగా వుంది. సావిడి మీదకు వొంగిన వేపచెట్టు అజ్ఞానంలా చిక్కగా వుంది. రాలుతున్న వేపపూలు పడిపోతున్న చుక్కల్లా వున్నాయి.

సావిడి దగ్గర నారిగాడు మనిషంతా వొంగి వొంగి తలంతా వూపి వూపి, ప్రాణాలు వుగ్గబట్టి తప్పెట వాయించి, యీలకరచి అరిచినాడు:

"దండోరా యినండి. రేపు రెడ్డీ తాసిల్దారు బయానా లెక్కలు వసూలు చేయడానికి వత్తుండారు. బయానా బాపతు కంతులు చెల్లించక పోతే జపుతు జేత్తారో...."

నారిగాడి దండోరా దెబ్బకు సావిట్లో వట్టిగొడ్ల అరుపులు ఆగినాయి. రాజకీయాల వరద తగ్గుముఖం పట్టింది, మెట్ట వేదాంతం భూమ్మీదకు దిగింది, పులిగీతలో మేకల బలి ఆగిపోయింది. నక్కాముట్టి ఆగిపోయింది. అపాల్సినంత కొంపలేమీ తగలబడలేదని యిస్పెట్టాకులు సాగిపోయినాయి. వెర్రి కొండయ్య బ్రహ్మంగారి

తత్వాల సంగీతపు హోరు చెదరలేదు. నాటుసారా వాసన సజావుగానే గుప్పుమంటోంది. బీడీలు సిగరెట్ల పొగ బూడిదరంగు వలయాలు తిరుగుతూనేవుంది.

నారిగాడి వెంట వచ్చిన కట్టుబడి చెన్నిగాడు యమదూతలా వున్నాడు. ధర్మదండంలా వున్న పొన్నుకర్రను పట్టుకున్నాడు. బయానాబాకీ వసూళ్ళ దండయాత్రను ప్రభుత్వ ప్రతినిధిలా వివరించినాడు:

"సబ్బు కలకటేరు దొర కరకట్టు మనిషి. బయానా లెక్కలు వసూలు జేయమని తాసిల్దారు నెత్తిన గూకున్నాడు. కొత్త తాసిల్దారు పిరిగ్గొడ్డు. మన రెడ్డి మెడమీద గూకున్నాడు. మన రెడ్డి మా కట్టుబడోళ్ళ గొంతుమీద గూకున్నాడు. మమ్మల్ని తరిమినాడు. యీ సారి బయనా లెక్కలు రాబట్టక పోతే అందు రుద్దోగాలకూ గండం తప్పదంట. అయినా యీ కరువురోజుల్లో యే మొగం పెట్టుకొని మేము రైతులను అడగాల? గవర్నమెంటోడు పెట్టేతిప్పలు వొకటా రెండా? కానీ గవర్నమెంటు బాద గవర్నమెంటుకూ వుంది. మాలాంటోల్లకు యెంతో మందికి జీతాలియ్యాల్నా? మీబాద మీకుంది. మీ సంసారాలను గాక మాలాంటోల్లను సానా మందిని సాకాల్నా? మాబాద మాకుంది. యీ కుక్క బతుకు బతకాల్నా? యెవన్నసీ లాబంలేదు. రోజులు సెడ్డయి. లేకపోతే నిన్న కొత్తపల్లెలో పెదరెడ్డి వర్దిరెడ్డి - వొకప్పుడెంత పెద్దసంసారం - సమయానికి డబ్బు కట్టలేకపోతే ఆయన యెద్దులు జపుతు చేసినారు. నాకేడుపొచ్చింది. కానీ మాదేముంది? వొళ్ళమ్ముకున్న వాళ్ళం. పెద్దోళ్ళ అరదరు. వర్ది రెడ్డి యెద్దుల్నికూడా బందెలదొడ్డికి తోలినాం."

పెదరెడ్లూ, చినరెడ్లూ, నాయనోరూ చెన్నుగాన్ని సావధా నంగా విన్నారు. కోపాల్లో, తాపాల్లో మాటలతో, అరుపులతో, బూతు లతో "పోయేకాలం వచ్చిన ప్రభుత్వాన్ని" చించి చెండాడి చేటలతో తూర్పారబోసినారు. బయానా బాకీని కట్టలేని బ్రతికి చెడ్డ రైతులూ, బక్క రైతులూ నడపీనుగుల్లా వున్నారు. దళయెత్తుకొని యింత వెనకేసి అప్పులివ్వగలవాళ్ళు కొర్నపోతుల్లా నవ్వుతున్నారు. సావిడి పాడుబడ్డ మంచినీటి నడబావిలా కుళ్లగా వుంది; కొర్నపోతు నవ్వులా కుచ్చితంగా వుంది.

తన బయానా బాకీ సంగతి యెవడో వొకడు సరిపోనోడు రచ్చకు తేవచ్చునని గంగయ్య హడలి పోయినాడు. యెద్దుపుండు కాకులకు యెప్పుడూ రుచే.

అయితే దండోరాకు ముందు గంగయ్యకు యీ విషయం జ్ఞాపకం రాలేదు. జ్ఞాపకమే వచ్చివుంటే గంగయ్యా కొన్ని యెద్దుల పుండ్లు సావిట్లో రుచిచూడక పోయి వుండునేమో!

గంగయ్య పూడుబాములా మెల్లిగా సావిట్లోంచి జారు కున్నాడు. వున్నట్లుండి యీ రకంగా యే యీతిబాధో అప్పులబాధో మీదికొస్తే గంగయ్య యింట్లో జగితిమీదున్న మంచంమీద ముసుగు తన్నుతాడు. సమస్యకు పరిష్కారం దొరికిందాకా ముసుగులో తపస్సు కొనసాగిస్తాడు.

గాటిపాటి కోడెలు తలలు యెగరేసినాయి. చిలమోరలకున్న అందెలు ఘలు ఘలు మన్నాయి. గంగయ్య తపస్సు భంగమైంది. ము ఖంమీదనుంచి మెడమీదకు దుప్పటి లాక్కొని గాటిపాటి నెమ

శేస్తున్న రెండు కోడెలనూ చూసినాడు. గంగయ్య హృదయం బాధతో నిండిపోయింది. ఆలోనచల్లో జప్తు తాండవించింది.

యీ కోడెలను జప్తుచేస్తే యింకేముంది? నెత్తిమీద గుడ్డ వేసుకోవాల్సిందే. జప్తు తప్పదేమో! బయానాబాకీ యెట్లా తీర్చేటట్లు? చేతిలో డబ్బులేదు. చేతిలో డబ్బు యెప్పుడుండి చచ్చింది గనుక? పోయినేడు పంటల్లేవు. యీ యేడు పంటల్లేవు. అసలు యీ పదేండ్ల నుంచీ పంటలు యెప్పుడు సరిగ్గా పండిచచ్చినాయి? అప్పులుమాత్రం పండుతున్నాయి. యీ యేడు విత్తనం ఖర్చులుగూడా యెల్లలేదు. సంగటి గింజలుకూడా కొనాల్సిన రోజులు వచ్చినాయి. అఖరుకు పశువులకు మేతకూడా కొనాల్సిన చెడ్డ రోజులు దాపురించినాయి. యింకెక్కడ బయానా బాకీ తీర్చడం? గవర్నమెంటు యేదో అప్పి స్తామని యెరచూపడం యెందుకు? యేడ్పించడం యెందుకు?

సరిగ్గా యేడాదికిందట మంగలోని పంపు మూడెకరాలు అమ్మి మరీ తొందరబాకీలు తాను తీర్చినాడు. ఆ బాపతు అయిదునూర్లు మిగిల్తే వాటికోసం మీదికెగబడిన చిల్లర బాకీలవాళ్ళకు చెప్పకొని కోడెలోళ్ళ దగ్గర రెండు కోడెలను కొన్నాడు-అదీ రెండు కంతులు బాకీపెట్టి. వాక కంతుకట్టి. యీ కరువురోజుల్లో బయానా కంతులను యీ గవ ర్నమెంటు అడగొచ్చిందా చచ్చిందా అనుకుంటే యీ పొద్దునెత్తి మీద కొచ్చినారు- తప్పెట టమటమలాడిస్తూ. యిస్తావా చస్తావా లేక పోతే గొడ్డు గోదా జప్తు చెయ్యమంటావా అంటూ. ఆ మంగలోని పంపు బాపతు మిగిలిన అయిదునూర్లూ బయానా కంతు కట్టినా బాగుం దేది. శని! నెత్తిమీద పెద్దమ్మ!

కర్మకొద్దీ పోయిన వుగాదికి ముందు, నెల యెడంతో యెద్దులు చావకపోయి వుంటే యీ కోడెలు కొనాల్సి వచ్చేదికాదు. సెలఅయి పుల్లెద్దు చచ్చింది. సరక తగిలి కర్రెద్దు చచ్చింది. తనకే యే దూమూ తగలంది! లేకపోతే యెద్దులు చావడమూ తన కమాషిలోనే జరగాలా? ముదెబ్బ కాలంలో యిట్లాగే యెద్దులమీద యెద్దులు చచ్చిపోయా యంట? దాంతో ముదెబ్బ బీజాక్షరాలు చెక్కించిన బండ గాట్లో వేయించినాడు. మంత్రాలబండ తన దరిద్రాలకు అడ్డురాలేదు. నొసటి రాతను చెరపలేదు. తగిలిన కాలికే దెబ్బలు తగుల్తాయి. లేకపోతే అర్థాంతరంగా యీ జప్తు వచ్చి పడుతుందా! యీగండం గడిచేదెట్లా? యెలక్షన్లన్నా దగ్గర్లోలేవు. వోట్లకాలమన్నా అయితే యీ బాధ వుం డేది కాదు; బతుకు బజారు పాలవుతాంది.

గంగయ్య వుండే వీధిలో దండోరా మోగింది. నారిగాడి అరుపు "గొడ్డూ గోదా జవుతు" గంగయ్య హృదయంమీద సమ్మెట పోటయింది. గంగయ్య మరింత ముడుచుకొని పోయినాడు. మన సులో అప్పు అన్వేషణ తీవ్రంగా మొదలయింది.

యిప్పుడెవన్నడగాల యీ అర్వూర్లో. వూర్లో సగానికి పైగా అరిపోయే సంసారాలు- అంకిరెడ్డితప్ప. రామానాయుడుతప్ప. గూనిసెట్టితప్ప. అంకిరెడ్డినే అడగడం మంచిది - రామానాయుడు వ్యాపారస్తులకు తప్ప డబ్బివ్వడు. గూనిసెట్టి డబ్బు దొంగబంగారం వ్యాపారంలో వుంది. అంకిరెడ్డినే అడగడం మంచిది - కఠినం ముండాకొడుకే అయినా. వాడిదగ్గర పెనక్కాయ విత్తనాలబాకీ అసలు కంటే వడ్డీ యెక్కువయింది. యిస్తాడో, గునుస్తాడో? పరమ

నాన్పుడుగాడు. పైగా శివునిమీద గుర్రుగా వుంది-వూళ్లో తనమాట ఖాతరు చెయ్యడనీ. చిల్లరోళ్ళను వెనకేసుకొస్తాడనీ.

శివునికి వుద్యోగం వచ్చినా బాగుండు. యెవడో వొకడు తల మాసినోడు దొరుకుతాడు. పిల్లనిస్తాడు. యే ఆరేడు వేలో రాల్తాయి. అప్పులు తీర్చి మట్టసంగా బతకొచ్చు.... కానీ ఆస్తీ వుద్యోగమూ లేనో డికి పిల్ల నెవరిస్తారు? పిల్లనిచ్చినా కట్నమెవరిస్తారు? కట్నంరాలేదు. వుద్యోగం ఖర్చుల క్రింద మాత్రం వెయ్యి రూపాయలు తగలబడి నాయి. వొకటీరెండు టెంపరవరీ వుద్యోగాలు దొరికినా నిలుపుకున్న దేదీ? వాడికి మతిపోయినట్లుంది. వాడి వాలకం చూస్తే నన్ను నట్టేట్లో ముంచేటట్లుంది. ముంచుతాడు. లాభంలేదు. తప్పక ముంచు తాడు. వాడు చెయిదాటి పోతున్నాడు. తండ్రినే యెదిరిస్తున్నాడు. బాగుపడే రాతలేదు. యేం బతుకో? దరిద్రపు బతుకు?

గంగయ్య మనసులో తన్ను తాను శపించుకున్నాడు. తీవ్రంగా కొడుకును శపించినాడు.

యింట్లోకి శివుడు వచ్చిన అలికిడి అయింది. గంగయ్య మళ్ళీ ముసుగు తన్నినాడు. శివుడు యెదురుగ్గా వున్నప్పుడు గంగయ్యకు కం పర మెత్తుతుంది. శివుడు స్వీయధోరణిలో తండ్రిని ప్రశ్నించినాడు:

"జప్తుగొడవొచ్చింది. వూరంతా గందరగోళంగా వుంది. తినడానికి తిండిగింజలు లేక చస్తోంటే అప్పు లెక్కడ కడతారు? లక్షలూ, కోట్లూ పన్నులెగవేస్తే అడిగే దిక్కులేదు. అమాం బాపతు సంఘాలు పెట్టి పెద్ద మొత్తాలు తింటే దిక్కులేదు. కానీ నోరూ

వాయీలేని బక్క రైతులమీద ప్రతివాడూ పడతాడు. సహించే వాళ్లున్నప్పుడు తన్నేవాళ్లకు కొదవేముంది?.... మనమూ బయానా బాకి కట్టాలికదూ?"

గంగయ్య మాట్లాడలేదు. శివుడు కొనసాగించినాడు;

"గూనిసెట్టి దగ్గరకో, అంకిరెడ్డి దగ్గిరకో, రామానాయుడు దగ్గరకో పోతే తప్ప, కొంపలు తాకట్టు పెడితే తప్ప రేపు యెంత మంది కడతారు? సన్నరైతులు పదిమందీ కలిస్తే బాగుండదా? ప్రెసిడెంటుతో మాట్లాడి ఆ జప్తేదో ఆపిస్తే బాగుండదా? బయానా బాకీలు రేపు వసూలు కాకపోతేనే ప్రభుత్వం దివాలా తీస్తుందా?"

గంగయ్య పలకలేదు.

శివుడికి మండుకొచ్చింది?

"అవున్లే మంచి పనికోసం నలుగురూ యెందుక్కలుస్తారూ? సావిట్లో అయితే యెవరి కొంపన్నా ఆర్పడానికి నలుగురు పల్లు పది మంది కలుస్తారు. నిజమేలే? మనలాంటివాళ్లు లేకపోతే దేశం బాగు పడేదెట్లా?"

శివుని మాటలు గంగయ్యకు పల్లేరు కాయల్లా గుచ్చుకున్నాయి. కుబుసం విడిచిన పాములా దుప్పటి పక్కకు విసురుగా లాగి కొడుకు మీదికి కస్సుమని లేచినాడు:

ఈ దండోరా వూళ్ళోకి వచ్చినప్పటి నుంచీ దిక్కుతోచక చస్తున్నా. నీదొక పీకుడు. నీమాదిరి కబుర్లు చెప్పడానికేం నేనూచెప్తా. వొక్క టీచరుద్యోగం రెండేడ్ల నుంచీ సంపాదించుకోలేక మూల

గూకున్నావా? దొరికిన టెంపరవరీ వుద్యోగలన్నా మర్యాదగా జేసినావా? నీకేదో దయ్యం పట్టిండి. నాకొంప గూఇస్తున్నావు. సంసారం బరువు మెడమీదేసుకో తెలుస్తుంది."

"మెడమీదేసుకొనే బరువెట్లాంటిదో తెలిస్తే బాగుండేది. యెందుకిట్లా మెడమీద అఱ్రువాచేట్లు మొయ్యాల్సి వస్తుందో ఆలోచిస్తే తెలిసేది" శివుడు నెమ్మదిగానే అనినాడు.

గంగయ్య స్వగతం దీనంగా చెప్పుకొని పోయినాడు:

"యిప్పుడుండే భూమి పదమూడెకరాలు. తోట యెకరన్నర-అదీ యెనిమిది వంతులుండే బాయి కింద. పండే పంటలసంగతి నీకు తెలుసు. యింటి ఖర్చులూ నీకు తెలుసు. నేమ పడే అవస్థలూ నీకు తెలుసు. నీ చెల్లెలు పెళ్ళి ఖర్చు. నీ చదువుఖర్చు. నీ వుద్యోగ ప్రయత్నం ఖర్చు- ఆ ఖర్చూ యీ ఖర్చూ యీ భూమిలో పండినాయా? యిన్ని ఖర్చులకు తోడు నెత్తిమీద పెద్దమ్మ. నాలుగయిదు యెద్దులు చచ్చె. ఆ బాయికిందనైనా నాలుగు డబ్బులు రాల్తాయనుకుంటే పోయినేడు యెర్రగడ్డలేస్తే కంకెడేసి వూరె. యెప్పుడూ పండని పంట పండె. యేం లాభం? కొనే వాళ్ళులేక కుళ్ళిపాయె. యీ యేడు మిరపకాయలేస్తే మణుం రెండురూపాయలైనాయి. అమ్మబోతే అడివి. కొనబోతే కొరివి. యేం చెయ్యమంటావు? నా బుద్ధీ పనిచెయ్యడంలేదు. నువ్వన్నా నలుగురి కడుపులో కాళ్లో పట్టుకొని వుద్యోగం సంపాయిస్తావా అంటే అదీలేదు."

నా బదులు నువ్వు అందరికాళ్ళు పట్టుకుంటున్నావుగా? నా వుద్యోగంకోసం అమ్మ ముడుపుకూడా కట్టుకుందిగా? వుద్యోగం

దొరక్కపోవడమే మేలైంది. చుట్టూవున్న జీవితం యేమిటో అర్థం మవుతోంది. భవిష్యత్తంటే యెట్లావుండాలో తెలుస్తోంది. మంచి మార్గమేమిటో కళ్ళకు కనపడుతోంది.

శివుడు మనసులోని యీ మాటలు తండ్రితో అనలేదు. అన్నానికి వచ్చినవాడు అన్నం తినకుండానే బయటికి నడచినాడు.

వీడు నా గుండెలమీది కుంపటయ్యాడు. యీ బయానా గొడవేదో అయిపోయినాక యేదో వొకటి చెయ్యాల. ముందు అంకిరెడ్డి దగ్గరకు వెళ్లాల.

గంగయ్య నిశ్చయించుకొన్నాడు.

బ్రహ్మ పదార్థాన్ని అన్వేషించడానికి వచ్చిన మహర్షిలా గంగయ్య అప్పుకోసం అంకిరెడ్డి యిల్లుచేరాడు. భక్తపరీక్ష మొదలయింది.

అంకిరెడ్డి గంగయ్యను చెణికాడు.

"అవునుగానీ బయానా బాకీలు కట్టకపోతే జప్తుచేస్తారంటావా? చెయ్యొచ్చులే. యీ ప్రభుత్వానికి యెంతతోస్తే అంత-మీవాడిలాగా. తిరుగులేదు. న్యాయంలేదు. అన్యాయం లేదు. అడిగేవాళ్లెవరు? మన ప్రసిడెంటు అడగడు. మీవాడిగుంపు అడుగుతుందా? బొక్కలో తోస్తారు. దండోరా అక్కడ సావిడి దగ్గర మొదలైందో లేదో నా మీద పది మంది యెగబడినారు. నేనేం రిజర్వు బ్యాంకునా? కానీ యే గొడవలన్నా రేపు జరిగితే వూరికెందుకు చెడ్డపేరని మనుషుల్ని పోగొట్టకోలేక పది మందికి సర్దినా- తలా యిన్నూరూ. మున్నూరూ.

నిన్నగాక మొన్న వెంకట్రామిరెడ్డి- అ కింట్రాక్టరు లేడూ. వాడొక పదివేలు కావాలని యింటికొచ్చి కూర్చున్నాడు. అడోళ్ళ

తరపున బంధువాయె! యేంచేసేది? బాంకిలో మావాళ్ళ సొమ్ములుబెట్టి డబ్బిచ్చి పంపినా- బిల్లులు పాస్ కాలేదు. నెలరోజుల్లో డబ్బు సర్దుతానంటే మా మరదలు పెళ్ళి పదిరోజుల్లో పెట్టుకున్నారు. నగల కోసం మా ఆడోళ్ళు మొత్తుకుంటారని యింతకు ముందే సేనక్కా- యలు అమ్మినా. దరల్లేకపోయినా డబ్బుకు విలువపోయింది. మంచి నీళ్ళు నయం. అన్యాయంగా కర్చుకావు"

అంకిరెడ్డి సోదివిని గంగయ్య ముఖం పాలిపోయింది.

చేయి చాచడానికి వచ్చినప్పుడు యే సోదైనా భరించక తప్పదు. దొంగా ముండాకొడుకు మొండిచెయ్యి చూపడానికి యెత్తు వేసినాడు. పెండ్లాం సొమ్ములు బాంకిలో పెట్టినానంటున్నాడు. బాం కిలో పెట్టడం నిజమయినా, రూపాయొడ్డీకి బాంకిలో అప్పుతెచ్చి, మనిషి అవసరాన్నిబట్టి నూటికి రెండూ, మూడూ, అయిదు గుంజే రకం! బాంకులుకూడా డబ్బున్నవాడికే అప్పులివ్వాల్నా, లేనివాళ్ళను బుక్కా- పకీర్లను చెయ్యడానికి? వాబార్య దగ్గర యే సేరుబంగారున్నా వీడి నీడకు రాకపోదును. పాపిష్టి నాయాలు. గంగయ్య అంకిరెడ్డిని మనసులో తెగతిట్టినాడు.

భార్య దగ్గర సేరు బంగారు లేదనే విషయం గంగయ్యకు గుర్తుకొచ్చింది. భార్యకు మిగిలించిన యేడువారాల సొమ్ము తాళి బొట్టు మాత్రం కళ్ళల్లో మెదిలింది. తాళిబొట్టుకు మెళ్లోవున్న విలువ బాంకులో వుండదనే సంగతి గంగయ్యకు తెలుసు. అంకిరెడ్డిని నీర సంగా ప్రాధేయపడినాడు:

"నిజమే యేం చెయ్యమంటావు చెప్పు. యీ బయానా బాకీ వున్నట్టుండి మీదపడింది. దిక్కుతోచక నీదగ్గరకు పరుగెత్తినా. యింట్లో వుండే ఆ రెండు కోడెలనూ జప్తుచేస్తే వూళ్ళో నేనుతలెత్తుకొని తిరిగేదెట్లా? నా సేద్యం పని యెట్లా? అవి కొన్నప్పట్నుంచి పని కుంటులేదు. అవి చెయ్యిజారిపోతే చావాల్సిందే. యెట్లన్నా ఆర్నూర్లు సర్దితే"

అంకిరెడ్డి బుఱ్ఱలో వొక మెరుపు మెరిసింది. బెట్టుగా దెప్పి పొడిచినాడు:

"చూడు గంగయ్యన్నా? వుండే సంగతి చెప్పినా. ఆ విత్తనాల బాపతు యిప్పటికే వడ్డీతో అయిదునూర్లు పైబడింది. అసలు సంగతి అట్లా వున్నా వడ్డీలుకూడ నిలిపితే నేనెట్లా బచ్చేది? మనిద్దరి మధ్యా పదేండ్ల నుంచీ లావాదేవీలున్నాయి. నువ్వేమీ అనుకోకుంటే వొక మార్గం వుంది. పాతబాకీ తీరుతుంది కొంత డబ్బు చేతిలో పడుతుంది. జప్తుగండం గడుస్తుంది. అది సరేగానీ నీకోడెలను అప్పుడు కొనిందెంత? చెప్పినావుగానీ. గ్యాపకంలేదు."

గంగయ్యకు అంకిరెడ్డి తిరుగుడు అర్థం కాలేదు.

"పదైదునూర్లు" గంగయ్య మూలిగినాడు.

"ఆ యేంలేదు. మొన్ననే వొక కాడిని అమ్మాల్సివచ్చె. యిపుడేమొ పనులు కసాలగా వున్నాయి. బయటికి పొయ్యే తీరిక లేదు. దానికితోడు యీ యెద్దుల సంగతి నాకేం తెలుసు. నీలాంటి వాడయితే సుళ్లూగిళ్లూ చూపి చిటికెలో పట్టుకొస్తాడు. నామీద అభిమానంవుంటే నీకోడెలను కొన్నధర కివ్వు. నష్టం వద్దులే. డబ్బుయెట్లాగో

తంటాలుపడి సర్దుతా. పాతబాకీ వడ్డీ యెక్కువది కదా? అది చెల్లేసి మిగతా డబ్బు తీసుకపో. యెద్దులమ్మితే నాకెట్లా నంటావా? నువ్వు కొత్తయి కొనుక్కోడానికి మరికొంత డబ్బు అప్పిస్తా. అప్పు వారం రోజుల్లో తప్పక చూస్తా. దానికి రూపాయన్నర వడ్డీనే చాల్లే. వూళ్లో ఆ వడ్డీకి నేనెవ్వరికీ యివ్వడం లేదు. నీకు తెలీదా?"

గంగయ్య సందిగ్ధంలో గిలగిలలాడినాడు:

అమ్మ దొంగనాయాలు! బోగం టక్కులూ వీడూ. కోడెల మీద కన్నేసినాడు. కానీ అమ్మకుంటే అప్పు దొరకదు. తన మొగం జూచి అప్పు యిచ్చే నాకొడుకేడీ - అంకిరెడ్డి తప్ప?

అమ్మితే, మూడు రూపాయల వడ్డీతో కొన్న విత్తనాలకాయల బాపతు పాత అప్పుతీరుతుంది. వెయ్యి రూపాయలదాకా చేతికొస్తుంది. వారం రోజుల్లో మళ్ళా డబ్బు కావాలన్నా యిస్తానంటున్నాడు. మరీ అంత విశ్వాసంలేని మనిషికాడు. ముందు ముందు యే యిబ్బందుల కన్నా మొగమాటంతో నన్నా యిస్తాడు. మంచి కోడెలే అయినా అంత పెద్దధర కోడెల బరువు తన కెందుకు? కర్మకొద్దీ చచ్చినా చావొచ్చు. రోజులు బాగుంటే రెండువేలు చేసే కోడెలే. కాని అమ్మాలన్నా యిప్పట్లో అంత ధర పెట్టేవాడెవడు? అందులోనూ డబ్బు చేతిలోపెట్టి కొనేవాడెవడూ? యిదీ వొకందుకు మేలేనేమో! రేపు కంతు కట్టవచ్చు. పరువు నిలుస్తుంది. చిల్లర బాకీలు తీర్చవచ్చు. పండగ ఖర్చులకు తట్టుకోవచ్చు. యేదో పని జరిగే యెద్దులు కొనడం మంచిది. వొక వారం రోజుల్లో మళ్లా వొక వెయ్యి రూపాయలు యివ్వకపోతాడా? కానీ యీరోజు అమ్మితే నలుగురూ యేమన్నా అనుకుంటారేమో!

గంగయ్య వూగిసలాటను అంకిరెడ్డి గ్రహించినాడు. అప్పు కొచ్చే వాడి కడుపులో రహస్యాలను పసిగట్టే దివ్యదృష్టి అంకిరెడ్డికి వుంది.

గంగయ్య చేతిలో వెయ్యిరూపాయలు పెట్టి అన్నాడు:

"నువ్వు వొప్పుకోవాల- నా కోసం! యిప్పుడు నువ్వు నాకు కోడెలమ్మడం గురించి వూళ్లో యేమన్నా అనుకుంటారనా? పోనీ యీ బయానా గొడవలు అయిపోయినాకనే కోడెలను మా యింటికి తోలి పంపుదువులే. నరమానవుడికి తెలియనీను. నువ్వు కొత్త యెద్దులు కొనేదాక మాకు తీరికున్నప్పుడు బండికో బల్లకట్టుకో వాడుకో. వద్దంటానా? డబ్బు యిబ్బందిగావున్నా శనక్కాయల డబ్బులోది తీసిస్తున్నా. బ్యాంకులో సొమ్ముల కోసం. తర్వాత నా అవస్థ నేను పడతానులే. పాత బాకీలోకి అయిదునూర్లు మాత్రమే పట్టుకున్నా. లెక్కలన్నీ చూసుకున్నాక రెండు మూడు రోజుల్లో బాండు కాగితాన్ని తీసుకుందువు. బాలన్సువున్నా యెక్కడికిపోతుంది?"

గంగయ్యకు నోట మాటరాలేదు. అతని మనసు పనిచెయ్యడం మానింది. డబ్బు చేతికందినప్పటికంటే. అప్పుకోసం తంటాలు పడేటప్పుడు అతని తెలివి బాగా పనిచేస్తుంది. చేతిలోని గాంధీ బొమ్మల పచ్చనోట్లలో గంగయ్యకు తీరిపోయే యిబ్బందులు రంగు రంగులుగా కన్పించినాయి.

గంగయ్య వెళ్ళినాక అంకిరెడ్డి మరొక్కమారు తన్ను తాను అభినందించుకొన్నాడు. గంగయ్య యిల్లు చేరినాక మరొక్కమారు తన్ను తాను తిట్టుకున్నాడు.

గొడుగుసుడి కోడెను ముఖ్యంగా అమ్మాల్సి వచ్చినందుకు మనసుకు కష్టంగా వుంది. గొడుగుసుడి కోడె తన కుటుంబాన్ని గడ్డన వేస్తుందనుకుంటే యేం లాబం? తనకు పరకసుడి వుంది. అది అంకిరెడ్డి గాటిపాట చేరతాంది. అంకిరెడ్డి అదృష్టం! చేతి కందిన యీ కోడెల డబ్బన్నా చేతిలో నిలుస్తాదా? గాలికి పేల పిండిలా యెగిరిపోతాది.

గంగయ్య అరచేయిచాపి చేతి వేళ్ళమధ్య సందులను చూచుకుంటూ నిట్టూర్చినాడు.

ఆ సాయంకాలం గంగయ్య శివున్నిచూచి ముఖం చాటేసుకున్నాడు. శివుడు యేమైందని గుచ్చి గుచ్చి అడిగినాడు. గంగయ్య ముద్దాయిలా సంజాయిషి చెప్పినాడు:

"అంకిరెడ్డికి కోడెలు అమ్మాల్సి వచ్చింది. యిప్పుడు మళ్లా కొత్త అప్పు చెయ్యడమెందుకని అమ్మినా. వాటిని మేపడంకూడా యీ రోజుల్లో మనలాంటివాళ్ళకు చాలా కష్టం. అందుకని అమ్మినా. దానికి తోడు పాతబాకీ తీరింది. రేపు గండం గడుస్తుంది. యింటి గౌరవం నిలుస్తుంది. వొక వారం రోజుల్లో చూసి తక్కువ ధరలో వొక దేశపెద్దుల కాడి కొనుక్కుంటే సరిపోతుంది. అంతో యింతో డబ్బు తక్కువొచ్చినా అంకిరెడ్డి సర్దుతానన్నాడు. రూపాయన్నర వడ్డీకే యిస్తానన్నాడు."

"వొకవేళ అంకిరెడ్డి మనసు మారుతుందేమో! యీ మిగిలిన భూమీ కొంపా పోయేదాకా ఆయన మనసు మారకుండా అప్పులు

యిచ్చేటట్లు చెయ్యమని దేవున్ని మొక్కుకోండి. అట్లాగే. యింత తెలివిగా వుచ్చులు బిగించారే-ఆ మహానాయకులందరూ కలకాలం అధికారంలో వుండాలనీ అంకిరెడ్లకు తోడ్పడాలనీ మొక్కుకోండి. మొక్కుకోవడం యే తిరుపతిలోనే అయితే యింకా బాగుంటుంది. యీలోపల మేము యే రాక్షసులుగానో తయారయితే చూచి సంతోషిద్దురు గానీ. ఆలోచన లేకపోవడానికైనా హద్దులుండాలి"

అనేదేదో సూటిగా అనేసి శివుడు బయటకు నడిచినాడు.

"ఆంధ్ర జ్యోతి" 7 యేప్రిల్ 1972.